శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారి సంపూర్ణ గ్రంథావళి.

# బాలభాష

## శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి

ప్రచురణ
శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి వాఙ్మయపీఠం
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి
**2015**

# BALA BHAASHA

By Sri Veturi Prabhakara Sastry

T.T.D. Religious Publications Series No.

First Edition: 2015

© All Rights Reserved

Copies : 1000

Price.Rs...............

Published by

Dr.D. Sambasiva Rao I.A.S.
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati -517 501

D.T.P. SVPSVP., T.T.D. Tirupati.

Printed at
Tirumala Tirupati Devasthanams, Press.
Tirupati.

*ఓం నమో వేంకటేశాయ*

# ముందుమాట

యోగివర్యులు, పరిశోధకులు, బహుముఖప్రజ్ఞాశాలి, కవి, గ్రంథపరిష్కర్తలు, సంకలనకర్తలు, వ్యాసరచయితలు శ్రీ ప్రభాకరశాస్త్రిగారు. వీరు అన్నమయ్య రచించిన సంకీర్తనలనేగాక ప్రాచీన కవుల తాళపత్రగ్రంథాలను పరిశీలించి, పరిష్కరించి ముద్రించారు. ప్రాచీన సాహిత్యంతోపాటు జానపద సాహిత్యాన్ని కూడా సమానంగా ఆదరించారు. ప్రజల్లో బహుళ ప్రాచుర్యం పొందిన పాటలను, సామెతలను, పలుకుబళ్ళను, నానుళ్ళను, నుడికారములను, చమత్కారములను, పొడుపుకథలను సేకరించి పత్రికల్లో అనేక వ్యాసాలను ప్రచురించారు. బాలభాష, పామరభాష, స్త్రీభాష, వృద్ధభాష అని తాను సేకరించిన వాటిని విభజించారు.

ప్రస్తుతం ప్రకటింపబడుతున్న గ్రంథం **బాలభాష**. శ్రీ శాస్త్రిగారు బాలలకు సంబంధించిన గేయాలను సేకరించి "బాలభాష" పేరుతో ముద్రించారు. ప్రజల్లో బాగా ప్రాచుర్యం పొందిన గేయాలిందులో ఉన్నాయి. ఆటలకు సంబంధించిన, ఆధ్యాత్మికమైన గేయాలు పిల్లలకు పఠనాసక్తిని కలిగించడమే గాక ఆటలపట్ల అభిరుచిని, పాటలపట్ల శ్రద్ధను కలిగిస్తాయి. సంస్కృతిని గురించిన అవగాహనను పెంచుతాయి. వ్యక్తి నిర్మాణానికి దోహదపడతాయి. భాషాభిమానాన్ని కలిగిస్తాయి. కావున ఒక మంచి గ్రంథాన్ని ముద్రిస్తున్న శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి వాఙ్మయపీఠం ప్రత్యేకాధికారిని, వారి సిబ్బందిని అభినందిస్తున్నాను. ఈ గ్రంథాన్ని తప్పక పఠించి ఆదరించగలరని ఆశిస్తున్నాను.

సదా శ్రీవారిసేవలో...

**(డి. సాంబశివరావు)**
**కార్యనిర్వహణాధికారి**

# నివేదన

కవి, వ్యాసకర్త, గ్రంథపరిష్కర్త, శాసన భాషాచారిత్రక పరిష్కర్త, ప్రాచీన గ్రంథ సంకలనకర్త, యోగసాధకులు శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు. తెలుగు భాషలో వారు ముట్టని ప్రక్రియలేదు. ప్రాచీన సాహిత్యాన్ని ఎంతగా గౌరవించారో జానపదసాహిత్యాన్ని అంతే గౌరవించారు. వీరు రచించిన వ్యాసాల్లో దేశి, జానపద సాహిత్య పరామర్శ ఒక ప్రత్యేకవిభాగం. సంస్కృతంలో వారికి కావలసినంత పాండిత్యం ఉన్నా, జానపదసాహిత్యంపై ఉన్న మమ కారంతో వారు జానపదవాఙ్మయ సేకరణకు పూనుకొని, విషయాన్ని సేకరించి "**గాలికబుర్లు**" అనే వ్యాసాన్ని రచించారు. అందులోనేవారు. "పాటలు, పదాలు, పొడుపుకథలు, సామెతలు, పలుకుబళ్లు, నానుళ్లు, దేశీయములు, నుడికారములు, జాతివార్తలు, చమత్కారములు, పొడుపుపద్యములు, చాటు ధారలు, లక్షణోదాహరణములు మొదలైన వాటిని భాషా సస్యపు పంటలలో ఇదివరకు సేకరము కాక గాలికి కొట్టుకొనిపోతూ ఉండే చెదురుడు, రాలుడు, పరిగగింజలను బిచ్చగాడనై ఊళ్ళూనాళ్ళూ తిరుగుతూ ముప్ఫైయేళ్ల ముందు నుండి ఎక్కడపడితే అక్కడల్లా ఏరుకు తెచ్చుకుంటున్నాను" అని వ్రాశారంటే జానపదసాహిత్యంపై వారికి ఎంత మక్కువ ఉన్నదో తెలుస్తుంది. ఈ మాటలు అక్షరాల సత్యమని వారు చేసిన కృషియే చెబుతుంది. జానపదసాహిత్యమంటే ఆ రోజుల్లో అంటరానిదని ఎవరుపట్టించు కోలేదు. అలాంటి సమయంలో శాస్త్రిగారు రకరకాల గేయాలను సేకరించి పామరభాష, వృద్ధభాష, బాలభాష, స్త్రీభాష అని రకరకాలుగా విభజించి వ్యాసాలరూపంలో ప్రచురించారు. కాటమరాజుకథను గ్రంథస్థం చేశారు. మధరకవితలు, మధురగీతములు, మధుర రచనలు, ముగ్ధమధురవాఙ్మయం అనే శీర్షికలతో పత్రికల్లో అనేక వ్యాసాలను ప్రచురించారు.

బాలబాలికల ఆటలకు సంబంధించిన పాటలను, కథలకు చెందిన పాటలను, పలుకుబళ్ళను సేకరించి "**బాలభాష**" పేరుతో పత్రికల్లో వ్యాసాలను ప్రకటించారు. తరువాత వాటిని **'బాలభాష'** గా గ్రంథస్థం చేశారు. ఆ గ్రంథాన్ని శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి వాఙ్మయపీఠం పక్షాన తి.తి.దే., ప్రకటిస్తున్నది. భాషపట్ల పిల్లలకు ఆసక్తిని కలిగించే ఒక మంచి గ్రంథాన్ని ముద్రిస్తున్నందుకు పీఠం సిబ్బందిని అభినందిస్తున్నాం.

సదా శ్రీవారిసేవలో..

**ప్రత్యేకాధికారి**

# విషయసూచిక


| | పుట | | పుట |
|---|---|---|---|
| మధురవాఙ్మయము | xi-xix | జడుపు | 32 |
| శ్రీసూర్యనారాయణా! | 1 | బలాబలాలు | 33 |
| మేలుకొలుపు | 3 | వానవల్లప్పలు | 34 |
| ఉగ్గు | 4 | నేతిలో నేరేడుపండు | 35 |
| చలికంతము | 5 | కాళ్లాగజ్జీ... | 36 |
| కలువరేకుల కళ్లు | 6 | గుడుగుడుకుంచం | 38 |
| కన్నబిడ్డలు | 7 | చెమ్మచెక్క | 39 |
| దోసపళ్లు | 9 | నెత్తిమీద గోరింక | 40 |
| శ్రీరాములవారు | 10 | తాతపెండ్లి | 41 |
| చదువుసందెలు | 12 | దాగుడుమూతలు | 42 |
| మంచిమాటలు | 14 | ఒప్పులకుప్ప | 43 |
| చెలిమి | 16 | బొమ్మలపెండ్లి | 44 |
| ఉన్నఊరు | 16 | నాలుగుస్తంభాలాట | 48 |
| ఎందుకు? | 17 | సందెగొబ్బె | 49 |
| కంచి కామాక్షమ్మ | 18 | గుమ్మాడమ్మా | 50 |
| కూనలమ్మపదాలు | 20 | తారంగం | 51 |
| ఈశ్వరుడు | 22 | తప్పటడుగులు | 52 |
| కాకమ్మ | 23 | చక్కిలిగింతలు | 54 |
| అయిదువ్రేళ్లు | 24 | దొంగవో? దొరవో? | 55 |
| సహజగుణము | 25 | దీపారాధన | 56 |
| పరాచకాలు | 26 | గోరుముద్ద; గుజ్జుముద్ద | 57 |
| అట్లతద్ది | 28 | అమ్మముద్ద; నాన్నముద్ద | 58 |
| చప్పట్లు | 29 | దొంగబువ్వ | 59 |
| బండిపాట | 30 | వెన్నెల గుజ్జులు | 60 |
| గచ్చకాయలు | 31 | జోలపాట | 62 |
| | | బూచివాని బిలువనంపనా? | 63 |


## బాలభాష

చిన్నారి పొన్నారి చిఱుత కుఱ్ఱడ రార!
అయ్య రారా! చక్కనయ్య రార!
అల్లారుముద్దుల పిల్లవాఁడా రార!
అప్ప రారా! కూర్మికుప్ప రార!
రత్నాలచిటిముల్లె రార! నవ్వుంబువ
తోట రారా! ముద్దుమూట రార!
ముత్యాలక్రోవి రా! ముచ్చట్లదీవి రా!
పల్కు వెన్నెల చిన్ని చిల్క రార!

కన్న కాచి రార! గారాలకూచి రా!
నాన్న రార! చిన్నయన్న రార!
ఆడ రార! నవ్వులాడ రారా! పల్కు
లాడ రార! కుల్కులాడ రార!



# ముగ్ధమధుర వాఙ్మయము

భాష యడవివంటిది. కవిత యుద్యానమువంటిది. అడవినుండి శోధించి యందు సుందరమైన చివురుగుత్తులతోనున్న తరులతాగుల్మాదులను గొనివచ్చి చక్కఁబఱిచి యుద్యానములందు నాఁటుకొనుచుందుము. బహుప్రయోజనమయిన యడవినుండి పరిమిత ప్రయోజనమయిన యుద్యానము పెంపొందుచున్నది. ఉద్యానపుహృద్యత కూడ నడవియం దెడనెడఁ బొడకట్టఁ గలదు గాని యరణ్యప్రయోజనములెల్ల నుద్యానమునం దొదవఁజాలవు. అడవి విచ్చలవిడిగాఁ బెరుగునది. ఉద్యానము పెంపుసొంపులకు అరణ్యపరిశోధన మత్యావశ్యకము. అట్లే సుకవిత పెంపుసొంపులకు భాషాపరిశోధన మత్యావశ్యకమగును. ఇంతవఱ కాంధ్రకవితోద్యాన పాలకులు తమ కవితోద్యానమందు నాఁటిన వచోవల్లరులు కొన్నిదెఱఁగులవే యున్నవి. ఇప్పుడు వింతవింత వన్నెచిన్నె యుద్యానములు వెలయుచున్నవి. పరికల్పకులును బలుదెఱఁగులవారు వెలయుచున్నారు. వారువారు వారివారి హృద్యతల కనుగుణముగా భిన్నభిన్నరీతుల పలుకు పువుగుత్తులను, వాని కూర్పు తీర్పులను జూచుకొనుచున్నారు. ఇది చక్కగా సాగుటకుఁ గవితోద్యానములు వెల్లివిరియుటకు, వార్వారు భాషారణ్యమునఁ బరిశ్రమించి, పరిశోధనము నెఱపి యపూర్వముల నరయుచుండు టావశ్యకము కాదా?

విచ్చలవిడిగా జీబుకొని వెలయుచున్న యాంధ్రభాషారణ్యమునుండి కవితోద్యానమునకుఁ గొనితేవలసిన హృద్యవచోవల్లరు లింకనెన్నోయున్నవి. చవులొలుకునవి, పలుకుబళ్లు, పాటలు, పదాలు, కథలు, గాథలు, సామెతలు ఇత్యాదులు పెక్కులు అపరిశోధితములై, యముద్రితములై లోకము వాకులందే పుట్టుచు గిట్టుచునున్నవి. అట్టివానిని బరిశోధించుటలోను, సేకరించుటలోను నాకుఁ గోర్కి కొండంత.

పామరులనుండి పండితులదాఁక, వారిలోఁగూడ బాల్యమునుండి వార్ధకముదాఁక నంతరము లనేకములున్నవి. ఎన్ని యంతరములున్నవో యన్ని భాషారీతులున్నవి. వ్యవహారార్థమైన భాషారీతులేకాక రంజనార్థమయిన కవితారీతులు గూడ నంతరములఁబట్టి యనేకభేదములు గలవిగా నున్నవి. అవియెల్లఁ బరిశోధితములై యాదృతములు గావలెను. పలువురు దీనికై ప్రయత్నించుట బాగు. భూములకువలె భాషకును సర్వే జరుగవలెను.

నే నట్లు సేకరించుచున్న దానిలో బాలుర ముగ్ధమధుర వాఙ్మయము నిప్పుడు వేఱుపఱిచి, 'బాలభాష' యను పేర గ్రంథముగా వెల్లడించుచున్నాఁడను. దాని నుద్దేశించియే నాకుఁదోచినవి నాలుగు ముక్కలిక్కడ వ్రాయుచున్నాఁడను.

ఉన్నత కవితావాహినికి బాలవాఙ్మయ మూటపట్టని చెప్పవచ్చును. బాలభాషలో సహజముగా నంకురప్రాయములుగాఁ గన్పట్టు కవితాగుణములే ప్రౌఢభాషలో సంస్కృతములై బలుపొందుచున్నవి. సరళాక్షరసౌష్ఠవము, సంగీతచ్ఛాయ, యతిప్రాససంగతి, యాంధ్రకవిత కవతారము నాడే యలవడినవన్న విషయము నీ బాలవాఙ్మయము ప్రవ్యక్తపఱుచుచున్నది. పసిపిల్లల కర్థానుస్యూతములుగా శబ్దములను సంధించి వాక్యములను వ్యాహరించుట కింక నలవాటు కాకముందే యతిప్రాసముల పొందిక యలవడుట కానవచ్చును.

రుంగు రుంగు బిళ్లా,
రూపాయదండా
దండాగాదు తామరమొగ్గ,
మొగ్గాగాదు మోదుగుమాడ.
– ఇత్యాది.

బండో యమ్మ బండి,
బండికి కుచ్చులు తెండి;

సుబ్బారాయడి పెండ్లి
చూచి వత్తాం రండి.

అమ్మనాకు బువ్వ,
అరచేతిలో గవ్వ.

చేయబోకు తప్పు
చేస్తే కాలి చెప్పు. – ఇత్యాది.

వీనిలో వాక్యార్థ సంగతి యంతగా లేకున్నను యతిప్రాససంగతి యనుగతమై కానవచ్చుచున్నది.

పంతులు పంతులు
పావుసేరు మెంతులు,
కూర్లోకి చాలవు
గుప్పెడు మెంతులు.

పంచా యెక్కం పంచా,
పంతుల్నేసి దంచా;
రోట్లో వేసి రుబ్బా,
రొట్టె గాల్చుకు దొబ్బా !!

బడిబాలురే కదా యీ దుడుకుఁ గవిత్వమునకుఁ గర్తలు; యతిప్రాసముల మెలపే కదా పయి రచనములకుఁ జెప్పఁదగిన యర్థము.

తెలియవలసిన విషయమంతయుఁ దేలికైన భాషలో, అందును వచనములో నున్ననుగూడ, నది వాక్యముపై వాక్యముగా నెడతెగకుండఁ దీగసాగుచున్నపుడు బాలురు, పామరులు వెంటాడుచు దాని యర్థము నందుకొనఁజాలకుందురు. ద్రవరూపమున నున్నను ఉగ్గుఁబాలను ధారగాఁ బోయుచున్నచో బాలురు త్రాగఁజాలరు. గ్రుక్కెడు గ్రుక్కెడు చొప్పున నాచియాచి



పోసినచోఁ ద్రాగఁ గల్గుదురు. అట్లయిన నా త్రాగినదియుఁ జక్కఁగా నిముడును, అట్లే తెలియవలసిన విషయమునుగూడఁ ద్రుంచి త్రుంచి యించించుకగాఁజేసి, నడుమ నడుమ, విశ్రాంతికై యెత్తుపలుకును గూడఁ జేర్చి చెప్పినచో బాలురు తేలికగాఁ దెలిసికొనఁ గల్గుదురు. అప్పుడు దాని యర్థమును తలలో వాంఁద్రకుఁ జక్కఁగా నెలకొనును. అంతేకాక యది యించుక తాళలయానుగుణముగా గణబద్ధమైయుండుటచేఁ జిత్తరంజకమై మరవరానిదై కూడ నుండును. హెచ్చుగా బాలురయు, పామరులయు వాఙ్మయ మీ విధముగాఁ గానవచ్చుచున్నది.

రామన్న రాముడోయి రామభజనా,
రాముడొస్తున్నాడు రామభజనా,
పూలారథము నెక్కి రామభజనా,
వూరేగుతున్నాడు రామభజనా.
– ఇత్యాది.

శ్రీరామ లక్ష్మణులు గోవిందా రామ,
చెలులతో గూడుకొని గోవిందా,
పన్నెండు వర్షములు గోవిందా రామ,
ప్రమదముతో ఉండిరీ గోవిందా,
దశరథుఁడంతటను గోవిందా రామ,
తగ వసిష్ఠునిజూచి గోవిందా,
– ఇత్యాది

తుమ్మెదపదాలు, కోవెలపదాలు, చందమామపదాలు, బాల నాగమ్మకథ మొదలయినవి యిట్టివే.

దశరథుడను పేర తుమ్మెదా
ఒక్క
ధరణీశుడున్నాడు తుమ్మెదా.

ఆ
ధరణీశునకు తుమ్మెదా
నలుగురు
తనయూలున్నారు తుమ్మెదా! - ఇత్యాది.

వీనిలో ఎత్తు పలుకులు విడిచితిమేని మిగిలినది సరిగా సాధారణ ముగాఁ జదువఁదగిన వచనముగా నుండును. యతిప్రాసముల సంగతికై రవంత రచనాప్రయత్నము కావలెను గాని యిట్టి రచనలలోని కేవచనముగాని సులువుగా విఱుగఁదీయవచ్చును. యతిప్రాసములు, తాళలయాన్వితమగు గణబంధము పొసఁగుటచే నివి చదువునప్పుడెంతో హృదయంగమములుగా నుండును. ఆంధ్రభాషకు సహజాలంకారములయిన యతిప్రాసములు, సంగీతచ్ఛాయ, బాలరచనములందు గానవచ్చుచున్నవి. అట్టి రచనములను బాలకులు పాలమీఁగడ చవితోఁ జదువఁగలరు. ఈ యింపునెఱుఁగక పోవుటచే నిప్పటి బాలపాఠగ్రంథ రచయితలు “ఇదిగో ఆవు. దీనికి నాలుగు కాళ్లు గలవు.” ఇత్యాదివిధములఁ బొల్లుమాటలతోనే పాఠములల్లి బాలకుల విసిగించుచున్నారు. బాల్యమం దిట్టి సముచిత సంస్కారముఁ బడయక పోవుటచే నిప్పటిబాలురు మంచి మంచి తెలుఁగు పలుకుబళ్లను, వాని సంగీతచ్ఛాయలను, పాటలను, బద్యములను జక్కఁగాఁ జదువనేరకున్నారు.

కంచికిపోతావా కృష్ణమ్మా!
ఆ - కంచి వార్తలేమి కృష్ణమ్మా?
కంచిలో ఉన్నది అవ్వ;
ఆ - అవ్వ నాకు పెట్టు బువ్వ,
బువ్వ ఉన్నదిగాని కృష్ణమ్మా!
నీకు - పప్పు ఎక్కడిదోయి కృష్ణమ్మా?
కోమటి యింటిది అప్పు;
ఆ - అప్పు నాకు పెట్టు పప్పు.



పప్పు ఉన్నదిగాని కృష్ణమ్మా!
నీకు - కూర యెక్కడిదోయి కృష్ణమ్మా?
దొడ్లోను ఉన్నది బీర;
ఆ- బీర నాకు పెట్టు కూర.
కూర ఉన్నది కాని కృష్ణమ్మా!
నీకు - నెయ్యి యెక్కడిదోయి కృష్ణమ్మా?
కోమటి అక్కెమ్మ చెయ్యి;
ఆ - చెయ్యి నాకుపోయు నెయ్యి.
నెయ్యి ఉన్నదిగాని కృష్ణమ్మా!
నీకు - పెరుగు ఎక్కడిదోయి కృష్ణమ్మా?
ఉన్న యింటి యిరుగుపొరుగు,
ఆ - పొరుగు నాకు పోయు పెరుగు,
బువ్వ తిందువుగాని కృష్ణమ్మా!
నీకు - ఆ వూళ్లోపనియేమి కృష్ణమ్మా?
అక్కడ ఉన్నది అమ్మ,
నేను - మొక్కివత్తును కామాక్షమ్మ.

ఈ పదము ‘కృష్ణమ్మ’ అని ఎత్తు పలుకు గలిగి, బువ్వ, పప్పు, కూర, నెయ్యి, పెరుగు, అను భోజన పదార్థముల వరుసతోను, వరుస అవ్వబువ్వ, అప్పుపప్పు, బీరకూర, నెయ్యిచెయ్యి, పొరుగుపెరుగు అను అనుప్రాస పదముల సంగతితోను, ముక్తవిషయగ్రస్తముగాఁ బప్పు మొదలగు వాని పునరుచ్చారముతోను గలదు గనుక, బాలుడు, ఎక్కాలు మొదలగు వానివలె బండవల్లె వేయ నక్కఱలేకుండ నించుకంత ధారణను అవధానమును జూపుచు, అప్పటికప్పుడు పయి పయి పలుకు నందుకొనఁగలిగి సులువుగాఁ గడముట్ట నప్పగింపఁగలుగును. దీనిచే బాలుని బుద్ధికి వయోనుగుణముగా సుకుమారమయిన పరిశ్రమము, యోజన, కలుగును. ఈ పదము ముగింపు

జీవితపరమార్థముగా భావికాలమునఁ జూచుకొనవలసిన యీశ్వర చింతనము నాటునదిగానున్నది. ఇట్టిదే యింకొక్కటి.

ఎండలు కాసే దెందుకురా?
వానలు కురిసే టందుకురా.
వానలు కురిసే దెందుకురా?
చెరువులు నిండే టందుకురా.
చెరువులు నిండే దెందుకురా?
పంటలు పండే టందుకురా.
పంటలు పండే దెందుకురా?
ప్రజలు బ్రతికే టందుకురా.
ప్రజలు బ్రతికే దెందుకురా?
స్వామిని గొలిచే టందుకురా.

ఇందు భౌతికస్వభావము వరుస చొప్పునఁ జెప్పఁబడుటచే బాలుఁడా వరుస నంటుకొని, యొకటి రెండు మారులు వినినంతనే తప్పకుండఁ బదము నప్పగింపఁగలడు.

సనసన్నగాఁ బ్రతిభ నుద్దీప్త పఱచి యవధానమును, ధారణను బెంపొందించి, చిత్తవృత్తి నిటునటు దొలఁగనీక బాలునికిఁ జురుకుఁదనము నేర్పఁగల కథలు, పలుకుబళ్లు పెక్కులున్నవి. "చిలుకలు కొట్టిన పలుకులేమి చేశావోయి? పిండిగొట్టానోయి. పిండేమి చేశావోయి? రొట్టెగాల్చానోయి." – ఇత్యాదులు కొన్ని, చేపకథ, గుఱ్ఱముకథ మొదలయినవి కథలు కొన్ని.

మఱియు బాలుర విద్యాభివృద్ధి యాటపాటల చాటున దెలియకుండా వెలయునదిగా నుండుట మేలు. ప్రాఁతకాలమున నది యట్టిదిగానుండెను. పసితనముననే బాలురకు రామకథ మొదలగు పుణ్యకథలను, నీతివార్తలును నుయ్యాలలలో నూచుచు, జోలలుగా బాడుచు తల్లులు నేర్పెడివారు. ఇప్పటికిని



బల్లెటూళ్ళలో ప్రాఁతకాలపు తల్లులిట్లు జోలలు పాడుట గానవచ్చును; గాని పట్టణములందుఁ జప్పఁగా జట్టువాఱుచున్నది. నేఁటి నాగరపు స్కూళ్లలోఁ జదువుకొను బాలిక లిట్టివాని నెఱుఁగరు గదా! వీరు తల్లులైనపుడు తనయుల కికనెట్లు తెలియును;

ఉత్తముని పేరేమి? ఊరు పేరేమి?
సత్యపురుషులఁగన్న సాధ్వి పేరేమి?
ఉత్తముడు దశరథుడు, ఊరు అయోధ్య,
సత్యపురుషులఁగన్న సాధ్వి కౌసల్య.

ఇల్లాళ్లు ముగ్గురే యీ దశరథునకు,
పిల్లాళ్లు నలుగురే పేరు గలవారు.
అయ్యోధ్యలో వారు అందరున్నారు,
సయ్యోధ్యలో వారు సరిలేని వారు.

జగతిపై రామయ్య జన్మించినాడు,
సత్యమ్ము లోకాన స్థాపించినాడు,
తల్లిదండ్రులమాట చెల్లించినాడు,
ఇల్లాలితోపాటు హింసపడ్డాడు.

సీతామహాదేవి సృష్టిలోపలను
మా తల్లి వెలసింది మహనీయురాలు.
శ్రీరామ జయరామ సీతాభిరామ
కారుణ్య గుణధామ కళ్యాణనామ!

కృష్ణమ్మ వంటివాడు కొడుకొకడు పుడితె,
కష్టాలు కడతేరు కన్నతల్లులకు.
మారు తల్లీచేత మాటపన్ననుచు
సారంగధరు దమ్మచావు కొప్పాడు.

పాటలతోను, పదములతోను గూడిన పసిపిల్లల యాటలనేకము లున్నవి. వానిలో వింతవింత విషయము లనేకములున్నవి. గణనీయమైన కవితయున్నది. బాలభాషలో నాకు శక్యమయినంత వాని సమకూర్చి నాఁడను.

నన్నయాది కవీశ్వరులు తమ దేశకాలములను దెలుపుకొనుటచే వారి గ్రంథముల ప్రాచీనత యెట్టిదో మన మెఱుఁగఁ గల్గుచున్నాము; కాని యీ పాటలు ఈ కాలమున వెలసినవని, వీరు రచించిరని చెప్పుట కెట్లు సాధ్యమగును? నన్నయాదుల కింకను బ్రాచీన కాలమునాఁటివిగూడఁ గొన్ని యిందుండవచ్చును. నిన్న నేఁటివి గూడ నుండవచ్చును. నన్నయాదుల రచనములకింక నెంతో పూర్వమే యిట్టి రచనములు పుట్టియుండక తీఱదు. నన్నిచోడాదు లిట్టివానిఁ బేర్కొన్నారు. పాల్కురికి సోమనాథు డిట్లనుచున్నాడు;

పొందంగ "రాగుంజ పోగుంజ లాట"
కుందెన "గుడి గుడి గుంచంబు లాట"
"అప్పల విందుల యాట" పల్మాఱు
చప్పట్లు వెట్టెడు " సరిగుంజ లాట"
"చేర బొంతల యాట" చిట్లపొట్లాట"
"గోరెంతలాట" "దాఁగుడు మూతలాట."

వీనిలో "గుడిగుంచ"మాట, "చిట్ల పొట్లాట" ఇప్పటికిని ఇదే యుపక్రమముగల పదములతో బాలకు లాడుకొనుచున్నారు. చూచితిరా! ఆ పదములెంత ప్రాఁతకాలము నాఁటివో!
("కళ" నుండి పునర్ముద్రితము)

*వేటూరి ప్రభాకరశాస్త్రి.*





## శ్రీ సూర్యనారాయణా!

పుట్టేటి భానుడా, పుష్యరాగపుచాయ
శ్రీ సూర్యనారాయణా!
పుష్యరాగముమీద పొంగుబంగరుచాయ
శ్రీ సూర్యనారాయణా!
జామెక్కి భానుడా, జాజిపువ్వులచాయ
శ్రీ సూర్యనారాయణా!
జాజిపూవులమీద సంపెంగపువుచాయ
శ్రీ సూర్యనారాయణా!
మధ్యాహ్న భానుడా, మల్లెపూవులచాయ
శ్రీ సూర్యనారాయణా!

మల్లెపూవుల మీద మంచి వజ్రపుచాయ

శ్రీ సూర్యనారాయణా!

మూడ్జాముల భానుడా, మునగపూవులచాయ

శ్రీ సూర్యనారాయణా!

మునగపువ్వులమీద ముత్యాలపొడిచాయ

శ్రీ సూర్యనారాయణా!

క్రుంకేటి భానుడా, గుమ్మడీపువుచాయ

శ్రీ సూర్యనారాయణా!

గుమ్మడీపువుమీద కుంకుం పువుచాయ

శ్రీ సూర్యనారాయణా!

ఆయురారోగ్యములు ఐశ్వర్యములనిమ్ము

శ్రీ సూర్యనారాయణా!







## మేలుకొలుపు

చిన్నారి పొన్నారి చిట్టి నా తల్లి!

చుక్కల్లో చంద్రుడూ చూడవచ్చాడు.

తెల్లవారొచ్చింది కోడికూసింది,

చూచేటి అక్కల్లు చూడరారమ్మ.

ఆడేటి అక్కల్లు ఆడరారమ్మ,

ఆడుకోరారమ్మ అక్కల్లు మీరు.

ఆడేటివారికి అచ్చావుపాలు,

పాడేటివారికి పాలు పంచదార.



## ఉగ్గు

ఊఁ ఊఁ ఉంగన్న,
ఉగ్గుపాలు ఇందన్న.
గుంటెడు ఉగ్గు కమ్మన్న,
ఉమ్మక కక్కక మింగన్న.
ఊఁ ఉఁ ఉఁ ఉంగన్న,
లుంగలు పెట్టకు గ్రుక్కన్న.
ఓర్వని సవతుల దిష్టన్న,
ఒప్పుగ మసలర బుచ్చన్న.
జీర్ణం జీర్ణం వాతాపి జీర్ణం!
గుఱ్ఱాల్ తిన్న గుగ్గిళ్లరిగి,
ఏనుగుల్ తిన్న వెలక్కాయలరిగి,
అర్జునుడు తిన్న అరటిపళ్ళరిగి,
భీముడు తిన్న పిండివంటలరిగి,
గణపతి తిన్న ఖజ్జాలరిగి,
అబ్బాయి తాగిన పాలు ఆముదం అరగి,
పందల్లే పాకి, కుందల్లే కూర్చుండి,
నందల్లే నడిచి, గుఱ్ఱమంత పరుగు,
ఏనుగంత సత్తువు ఉండేటట్టు
సాకుమీ, యీ బిడ్డను సంజీవ రాయా!





## చలికంతము

చలిచలిచలిచలి చందాయమ్మ,
గొంగళి గప్పుకో గోనాయమ్మ.

వడవడవడవడ వణికేనమ్మ,
చలిమంటకు చితుకులు తేవమ్మ.

(చలికాలము పసిపిల్లలు కంతముచుట్టు చిక్కనిబట్ట మడతపెట్టి రెండుమూడు చుట్లు కాళ్లదాకా వచ్చేటట్టు చుట్టించుకొని మెడపక్కను ముడివేయించుకొంటారు. దానిపేరు చలికంతము. చిదుకులతో చిన్న మంటవేసి దానికి కొంచెం దూరంగా కూర్చుంటారు. దానిపేరు చలిమంట. చలికి వణుకుతూ ఈ పదము పాడుతారు.)



## కలువరేకుల కళ్లు

పిల్లమ్మ కన్నుల్లు బీరపువ్వుల్లు,
అబ్బాయి కన్నుల్లు కలువరేకుల్లు.

కలువరేకులవంటి నీ కన్నులకును,
కాటుకలుపెట్టితే నీకు అందమ్ము.

ఏడువకు ఏడువకు వెఱ్ఱి అబ్బాయి,
ఏడుస్తె నీ కళ్లు నీలాలు కారు.

నీలాలు కారితే నే జూడలేను,
పాలైన కారవే బంగారుకళ్ల.







## కన్నబిడ్డలు

కొడుకుల్లు పుట్టన్ని కడు పేమి కడుపు?
కుల ముద్ధరించన్ని కొడుకేమి కొడుకు?

కన్నకానుపులెల్ల కడుచక్కనయితె,
కన్నుల్ల పండుగే కన్నతల్లికిని.

✻ ✻ ✻

లాభమ్ము లాభమ్ము ఏమి లాభమ్ము?
కొడుకులను గంటేను కోటి లాభమ్ము.

గోరంతదీపమ్ము కొండలకు వెలుగు,
గోపాలకృష్ణమ్మ గోవులకు వెలుగు.

మాడంతదీపమ్ము మేడలకు వెలుగు,
మారాజు అబ్బాయి మా కళ్ల వెలుగు.

✳ ✳ ✳

వీథిలో ఉయ్యాల అమ్మవచ్చినది
కొడుకులను గన్నతల్లి కొనవె ఉయ్యాల.







## దోసపళ్లు

త్రోవలో ఒకరాజు తోటేసినాడు,
తోటలోపల పండ్లు దొర్లుతున్నావి.

దొర్లుతున్నవి తియ్య దోసపండ్లన్ని,
ఆ పండ్లు పంపాదు ఆరగించంగ.

తింటేను తియదోస పండ్లే తినాలి,
కంటేను కొడుకుల్ల కాన్పే కనాలి.

కంటేను కొడుకుల్ల కాన్పే కనాలి,
అందితే అన్నతో వియ్యమందాలి.

అందితే అన్నతో వియ్యమందాలి,
ఆడితే వదినతో జగడమాడాలి.



## శ్రీరాములవారు

ఉత్తముని పేరేమి?
ఊరి పేరేమి?
సత్యపురుషులగన్న
సాధ్వి పేరేమి?
ఉత్తముడు దశరథుడు,
ఊరు అయోధ్య;
సత్యపురుషులగన్న
సాధ్వి కౌసల్య.
ఇల్లాళ్లు ముగ్గురే
ఈ దశరథునకు;
పిల్లాళ్లు నలుగురే
పేరు గలవారు.

అయోధ్యలో వారు
అందరున్నారు;
సయోధ్యలో వారు
సరిలేని వారు.

శ్రీరామ! జయరామ! శృంగారరామ!
కారుణ్య గుణధామ! కల్యాణనామ!
జగతిపై రామయ్య జన్మించినాడు,
సత్యమ్ము లోకాన స్థాపించినాడు.
తల్లిదండ్రులమాట చెల్లించినాడు,
ఇల్లాలితోపాటు హింసపడ్డాడు.
సీతామహాదేవి సృష్టిలోపలను,
మా తల్లి వెలసింది మహనీయురాలు.



అయోధ్యరామయ్య అన్నయ్య మాకు,
వాలుగన్నులసీత వదినమ్మ మాకు.
రాములంతటివాడు రట్టుపడ్డాడు,
మానవులకెట్లమ్మ మాటపడకుండ!
సీతమ్మ రామయ్య దారిగదిలితె.
పారిజాతపు పువులు పలవరించినవి.
సీతపుట్టగనేల! లంకచెడనేల?
లంకకు విభీషణుడు రాజుగానేల?
ఏడు ఏడూ యేండ్లు పదునాలుగేండ్లు,
ఎట్టులుంటివి సీత నట్టడవిలోను?
లక్ష్మయ్య నా మరిది రక్షిస్తూ ఉండ,
నాకేమి భయమమ్మ, నట్టడవిలోను?
దేవునంతటివాడు జననింద పడెను,
మానవుండెంతయ్య మాటపడకుండ?
అన్నదమ్ములులేక, ఆ దరువులేక,
తోడులేకా సీత దూరమైపోయె.
దండమ్ము దండమ్ము దశరథరామ!
దయతోడ మముగావు దాక్షిణ్యధామ!



## చదువు సందెలు



విఘ్నమ్ము లేకుండ
విద్య నియ్యవయ్య
విఘ్నేశ్వరుడ నీకు
వేయిదండాలు

ఉంగరమ్ములు పెట్టి, ముంగురులు దువ్వి,
ఒద్దపెట్టుకు తల్లి ముద్దులాడింది;
పలకబలపములిచ్చి, పద్యాలుపాడి,
సరసపెట్టుకు తండ్రి చదువు నేర్పాడు.

చదువుకో నాయన్న! చదువుకో తండ్రి!
చదువుకొంటే నీకు సౌఖ్యమబ్బేను!
ఆడుకో నాయన్న! ఆడుకో తండ్రి!
ఆడుకొంటే నీకు హాయి కలిగేను!



పిల్లలందరు రండి
బళ్లోకిపోయి,
చల్లన్ని గాలిలో
చదువుకొందాము.
విసరు విసరూ గాలి
విసరవేగాలి,
మల్లెపూవుల గాలి
మామీద విసరు.





అరటిపండూ తీపి, ఆవు పాల్ తీపి,
మా చిన్ని అబ్బాయి మాటల్లు తీపి,

చదువంటె అబ్బాయి
చండికేశాడు
బద్దెపలుపా రావె
బుద్ధిచెప్పాలి.

చదువంటె అబ్బాయి
సంతోషపడును,
అగసాలి రావయ్య,
నగలు చెయ్యాలి.

పొరుగు పిల్లలతోను
పోట్లాడబోక;
ఇరుగు పిల్లలతోను
యేట్లాడబోక.
చక్కగా నీ చదువు
చదువుకో తండ్రి!
చదువుకొంటే నీకు
సౌఖ్యమ బ్బేను.





## మంచిమాటలు

ఒంటికణతా నొప్పి,
ఒరగాలితీపు,
పంటిపోటూ వద్దు
పగవాడికైన.

ఓ చేదెకూ తగిలె
మోచేతి దెబ్బ;
అత్తింటి సౌఖ్యమని
అంగలార్చింది.

విద్య లేకుంటేను
విభవమ్ము రోత;
వినయమ్ము లేకుంటె
విద్యలూ రోత.

నిదురలో ప్రాణమ్ము
అదరునో యేమొ!
నిష్ఠురా లేలమ్మ
కష్టజీవులపై?

మారుతల్లీ చేత
మాటపడలేక,
సారంగధరుడమ్మ
చావు కొప్పాడు.



కృష్ణమ్మ వంటి వాడు
కొడు కొకడు పుడితే,
కష్టాలు కడతేరు
కన్న తల్లులకు.



బియ్యమ్ము తెల్లన్న, పిండి తెల్లన్న,
వరుస తప్పినవాని వలికి తెల్లన్న.
వరుసగానీదాన్ని వరుసలాడేవు,
పాపాత్మ! నీ శిరసు పక్కున్న పగులు.

కాలినిండా గుడ్డ వెయ్యంది రోత,
కానివాళ్ల కన్నెత్తి చూచింది రోత.
మంచిగంధపుచెక్క సాననే చీకు,
మంచాలిదేహమ్ము మనసులో చీకు.

ఆయుస్సు మూడినను
ఆకు చిరిగినను,
బ్రతికించువా రెవరు?
అతుకువా రెవరు?





## చెలిమి

కానివారీతోను
కావించు చెలిమి,
కట్టెవిరిచీ పొయిని
పెట్టినట్లుండు.
అయినవారీతోను
కావించు చెలిమి,
ఆకు మడచీ, మడత
పెట్టినట్లుండు.

కానివారీమాట కంట్లోది నలుసు,
ప్రాణంపోయిందాక ప్రక్కలోపోటు;
అయినవారీ మాట అమృతంపుతేట!
బ్రతికి ఉన్నందాక భాగ్యంబుమూట!



## ఉన్న ఊరు

ఉన్నఊరూ విడిచి
ఉండనే లేము;
కన్నతల్లిని విడిచి
ఘడియుండలేము.

ఉన్న ఊరే నాకు
చెన్నపట్ణమ్ము;
కన్నతల్లే నాకు
కల్పవృక్షమ్ము.



## ఎందుకు?





ఎండలు కాసే దెందుకురా?
మబ్బులు పట్టే టందుకురా.





మబ్బులు పట్టే దెందుకురా?
వానలు కురిసే టందుకురా.

వానలు కురిసే దెందుకురా?
చెరువులు నిండే టందుకురా.





చెరువులు నిండే దెందుకురా?
పంటలు పండే టందుకురా.

పంటలు పండే దెందుకురా?
ప్రజలు బ్రతికే టందుకురా.





ప్రజలు బ్రతికే దెందుకురా?
స్వామిని గొలిచే టందుకురా.

స్వామిని గొలిచే దెందుకురా?
ముక్తిని పొందే టందుకురా.



# కంచి కామాక్షమ్మ

కంచికి పోతావా కృష్ణమ్మా!
ఆ- కంచి వార్తలేమి కృష్ణమ్మా?
కంచిలో ఉన్నది అవ్వ;
ఆ - అవ్వ నాకు పెట్టు బువ్వ.
బువ్వ ఉన్నదిగాని కృష్ణమ్మా,
నీకు - పప్పు ఎక్కడిదోయి కృష్ణమ్మా?
కోమటి యింటిది అప్పు;
ఆ - అప్పు నాకు పెట్టు పప్పు.



పప్పు ఉన్నదిగాని కృష్ణమ్మా,
నీకు -కూర యెక్కడిదోయి కృష్ణమ్మా?
దొడ్లోను ఉన్నది బీర;
ఆ -బీర నాకు పెట్టు కూర.
కూర ఉన్నది గాని కృష్ణమ్మా,
నీకు - నెయ్యి యెక్కడిదోయి కృష్ణమ్మా?
కోమటి అక్కెమ్మ చెయ్యి;
ఆ- చెయ్యి నాకు పోయు నెయ్యి.
నెయ్యి ఉన్నదిగాని కృష్ణమ్మా;
నీకు - పెరుగు ఎక్కడిదోయి కృష్ణమ్మా?
ఉన్న యింటి యిరుగుపొరుగు,
ఆ - పొరుగు నాకు పోయు పెరుగు,
బువ్వ తిందువుగాని కృష్ణమ్మా;
నీకు - ఆ వూళ్లో పనియేమి కృష్ణమ్మా?
అక్కడ ఉన్నది అమ్మ,
నేను - మొక్కివత్తును కామాక్షమ్మ.





## కూనలమ్మ పదాలు

('కూనరాగాలు తీస్తున్నా' డని మధ్యాంధ్ర దేశమందున్నూ, 'కూనలమ్మ సంగీతాలు తీస్తున్నా'డని దత్తమండల మందున్నూ వాడుకలో నానుడిపలుకు ఉన్నది. అది ఈ క్రింది పదాలనుబట్టి పుట్టినది. ఇట్టి పదములెన్ని ఉన్నవో తెలియదు. అరవములో అవ్వయార్ పదా లెంత విలువగలవో తెలుగులో కూనలమ్మ పదాలుకూడా అంత విలువ గలవే అనవచ్చును.)

జప తపంబులకన్న,
చదువు సాములకన్న,
ఉపకారమే మిన్న.
ఓ కూనలమ్మా!

అన్న మిచ్చినవాని,
నాలి నిచ్చినవాని,
నపహసించుట హాని,
ఓ కూనలమ్మా!

మగనిమాటకు మాటి,
కెదురు పల్కెడు బోటి,
మృత్యుదేవతసాటి,
ఓ కూనలమ్మా!



కాపువాడే రెడ్డి,
గరికపోచే గడ్డి,
కానకుంటే గుడ్డి,
ఓ కూనలమ్మా!

కవితారసపుజల్లు,
ఖడ్గాల గలుగల్లు,
కరణాలకే చెల్లు,
ఓ కూనలమ్మా!

దుర్యోధనుడు భోగి,
ధర్మరా జొక జోగి,
అర్జునుండే యోగి,
ఓ కూనలమ్మా!

భీష్ము డనుభవశాలి,
భీముడే బలశాలి,
కర్ణుడే గుణశాలి,
ఓ కూనలమ్మా!

ఆడితప్పినవాని,
నాలి నేలనివాని,
నాదరించుట హాని,
ఓ కూనలమ్మా!



## ఈశ్వరుడు

లోకమ్ముమ్మవారికీ రెండు కన్నుల్లు!
లోకరక్షక, నీకు వేయికన్నుల్లు!

ఇద్దరు పెండ్లాలు, ఈశ్వరుడ నీకు,
పలువరుస చక్కనిది పార్వతీదేవి.

కన్నుల్లు చక్కన్న కనకదుర్గకును,
ఇద్దరుపెండ్లాము లేలయ్య నీకు?

ఎద్దెక్కి తిరిగేవు ఈశ్వరుడ నీవు,
బిచ్చమెత్తిందాక బిడ్డలకు లేదు!
అడిగితెచ్చిందాక ఆలికే లేదు!!







## కాకమ్మ

కాకమ్మా! కాకమ్మా!!
చుట్టాలొచ్చారు చూచిపో,
పక్కాలొచ్చారు పారిపో,
నీ కాలికి గజ్జకడతా,
కాలుతీసి ఖంగున గంతెయ్!

✳ ✳ ✳

చందమామ బొట్టు
నా సందిటికేసికట్టు,
ఊళ్లోవుంటే ఒట్టు
నీవు వచ్చిన దారినిబట్టు.



## అయిదు వ్రేళ్లు

చుట్టాలసురభి – బొటనవ్రేలు
కొండేల కొరివి – చూపుడు వ్రేలు
పుట్టుసన్యాసి – మధ్యవ్రేలు
ఉంగరాల భోగి – ఉంగరపు వ్రేలు
పెళ్లికి పెద్ద – చిటికెన వ్రేలు

✻ ✻ ✻

తిందాం తిందాం ఒకవేలు!
ఎట్లా తిందాం ఒకవేలు?

అప్పుచేసి తిందాం ఒక వేలు!
అప్పెట్టా తీరుతుంది ఒక వేలు?

ఉన్నాగదా నేను అన్నింటికీ
పొట్టివాణ్ణి, గట్టివాణ్ణీ బొటనవేలు!

(చిటికన వ్రేలు, ఉంగరము వ్రేలు, నడిమి వ్రేలు, చూపువ్రేలు, బొటన వ్రేలు, అని అయిదు వ్రేళ్ల పేళ్లు. ఈ అయిదు వ్రేళ్లూ అనుకొన్నట్టు ఒక్కొక్క వ్రేలినీ చూపుకుంటూ బాలకు లీ పదములు పాడుదురు.)





## సహజగుణము

చిమడకే చిమడకే
ఓ చింతకాయ!
నువ్వెంత చిమిడినా,
నీ పుల్లపోదు.

ఉడకకే ఉడకకే
ఓ ఉల్లిపాయ!
నువ్వెంత ఉడికినా,
నీ కంపు పోదు.



## పరాచకాలు

వదినగారూ మీరు వాసిగలవారు,
వండబోయినచోట కుండ నాకేరు!

బావగారూ మీరు ప్రతిభగలవారు,
నిండిన్నసభలోను పిండిబొక్కేరు!

చక్కిలాలాబుట్ట చంకబెట్టుకొని,
సభలోను మా బావ సంగీతపరుడు!
అత్తింటికోడలూ అలిగి పడుకుంది,
అలుకల్లు తీర్చవే ములుకుల్ల కఱ్ఱ!

అట్లుతిని అన్నయ్య అలిగిపడుకుంటే
తిట్లుతిని వదినమ్మ తీపు లందింది!

పొద్దోయి పొద్దోయి అన్నయ్య వస్తే,
జల్తారు చీరల్లు కట్టు వదినమ్మ.



చింతాకు చక్కన్న చీర చక్కన్న,
సిరిదేవి మా వదిన చీర చక్కన్న.

బావా బావా పన్నీరు,
బావనుపట్టుకు తన్నేరు.!
వీధివీధి తిప్పేరు,
వీశెడు గంధం పూసేరు!
చావడి గుంజకు కట్టేరు,
చప్పిడిగుద్దులు గుద్దేరు!

అందలము కోరింది కుందనపుకుచ్చు,
అతిభోగి కోరాడు అత్తవారిల్లు;
పల్లకీ కోరింది పచ్చన్నికుచ్చు,
పరదేశికోరాడు పంచటరుగుల్లు.





## అట్లతద్ది

అట్లతద్దోయ్, అట్లతద్దోయ్!
ముద్దపప్పోయ్, మూడట్లోయ్!

✲ ✲ ✲

చిప్ప చిప్ప గోళ్లు,
సింగరయ్య గోళ్లు;
మా తాత గోళ్లు,
మందాపరాళ్లు!



## చప్పట్లు



చప్పట్లోయి, తాళాలోయి,
దేవుడిగుళ్లో మేళాలోయ్!
పప్పూ బెల్లం దేవుడికోయ్,
పాలూనెయ్యీ పాపాయికోయ్!

గోవిందుడమ్మా!
గోపాలుడమ్మా!
కొబ్బరీ బెల్లమ్మ,
కొనితెచ్చినాడే.
ఏడాది కొకసారి
ఇటువచ్చినాడే.
పల్లెటూళ్లుగాన,
చెల్లిపోయింది.
గొల్లవాళ్లముగాన,
కూడివచ్చింది.
పట్నవాసములోన
పనికివస్తుందా?

## బండిపాట

బండోయమ్మ బండి,
బండికి కుచ్చులు తెండి.
సుబ్బారాయుడు పెండ్లి,
చూచివత్తాం రండి.
అమ్మ నాకు బువ్వ,
అరచేతిలో గవ్వ.
నీళ్ల మీద నిప్పు,
అల్లరి పిల్లల ఒప్పు.
చేయబోకు తప్పు,
చేస్తే కాలిచెప్పు.





## గచ్చకాయలు

ఒక్కటి ఓ చెలియా,
రెండూ రోకళ్లు;
మూడూ ముచ్చిలకా,
నాలుగు నందన్నా;
అయిదుం బేడల్లు,
ఆరుంజవ్వాజి;
ఏడూ యెలమంద,
ఎనిమిది మనమంద;
తొమ్మిది తోకుచ్చు,
పదిపటనేడు.





## జడుపు

(పసిబిడ్డను ముందు కూర్చుండబెట్టుకుని యీ క్రింది పదము చెప్పుతూ చివరకు కళ్లలో "ఉఫ్" అని ఊదితే బిడ్డ కళ్లు మూస్తుంది. "అదిగో జడిసినావులే" అని గేలి చేస్తారు. అందాకా "జడవను, జడవను" అని బదులు చెప్పుతుంది.)

నూకలు పెడతాను మేకలుగాస్తావు? కాస్తా!
పెద్దపులివస్తే జడవవు గద? జడవను!
చిఱతపులివస్తే జడవవు గద? జడవను!
ఎలుగుబంటివస్తే జడవవు గద? జడవను!
సివంగివస్తే జడవవు గద? జడవను!
తోడేలు వస్తే జడవవు గద? జడవను!

అన్నింటికీ 'జడవను' అని చెప్పును. నే వస్తే జడవవు కద?
(ఇది చెప్పి కళ్లలో ఊదవలెను; బిడ్డ కన్నులు మూసుకొనును.)

జడిసినావులే అమ్మా జడిసినావు!!





## బలాబలాలు

చెన్నపట్నం, చెరుకుముక్క,
నీకో ముక్క, నాకో ముక్క;
భీముడుపట్నం, బిందెలజోడు,
నీకో బిందె, నాకో బిందె;
కాళీపట్నం, కాసులజోడు,
నీకో కాసు, నాకో కాసు.





## వానవల్లప్పులు

వానా వానా వల్లప్ప!
వాకిలి తిరుగూ చెల్లప్ప!
కొండమీది గుండురాయి
కొక్కిరాయి కాలువిరిగె
దానికేమి మందు?
వేపాకూ పసుపూ,
వెల్లుల్లిపాయ,
నూనెలో మడ్డి
(నూనెమ్మ బొట్టు)
నూటొక్కసారి,
పూయవోయి నూరి,
పూటకొక్కతూరి.

(వల్లప్పా! వల్లప్పా! వానకురుస్తున్న దంటుందిచెల్లెలు. బయటకుపోక చెల్లెలును వాకిట్లోనే ఆడుకోమంటాడు వల్లప్ప వానలో తిరిగితే కొండమీది నుండి (ఆకాశంనుండి) గుండురాళ్లు (వడగళ్లు) పడి కొక్కిరాయి (అల్లరి పిల్లవాడు) కాలు విరిగింది – కాబట్టి వానలోకి పోవద్దని వల్లప్ప అంటే, కాలువిరిగితే మందు ఏమిటని చెల్లెలు అడుగుతుంది.

వేపాకు, పసుపు, వెల్లుల్లిపాయ నూనెలో మడ్డి – ఇవన్నీ కలిపి, నూటొక్కసారివండి (ఆవర్తితతైలము) ఆ తైలమును పూట కొకసారి విరిగిన కాలుకురాస్తే, కూడుకొంటుందంటాడు వల్లప్ప.)





## నేతిలో నేరేడుపండు

చిట్లపొట్లకాయ,
సీమనెల్లికాయ;
గోడపుచ్చకాయ,
గొబ్బినెల్లికాయ;
అత్తకు పెడితే అల్లం
నే తింటే బెల్లం;
కొత్తకుండల్లోని గోధుమల్లారా!
పాలపిడతల్లోని పసిబిడ్డలార!
అమ్మ అమ్మ, నీ బిడ్డ పేరేమంటే,
నీళ్లల్లో నిమ్మపండు,
పాలల్లో పనసపండు,
నేతిలో నేరేడుపండు.



## కాళ్లాగజ్జీ..........

కాళ్లాగజ్జీ, కంకోలమ్మా,(గంగారమ్మా)
వేగులచుక్కా, వెలగామొగ్గ,
మొగ్గాకాదు, మోదుగనీరు,
నీరూగాదు, నిమ్మలవారి,
వారీగాదు, వావింటాకు (కూర)
కూరాగాదు, గుమ్మడిపండు,
పండూగాదు, పాపడిమీసం,
లింగూలిటుకు, పందిమాల్నిపటుకు,
రాజుగారితోట్లో యేముందంటే,
పువ్వో, మొగ్గో పుచ్చుకుంటే దెబ్బ,
కాల్దీసి కడగాబెట్టు.



చిట్టిపొట్టి మిరియాలు
చెట్టుక్రింద పోసి,
పుట్టమన్ను తెచ్చి,
బొమ్మరిల్లు కట్టి,
బొమ్మరింట్లో
బోగంపాప కన్నది.
బిడ్డతలకు చమురులేదు,
నా తలకు నూనెలేదు,
అల్లవారింటికి
చల్లకుపోతే,
కలవారి కుక్క
భౌవ్ మన్నది!
నా కాళ్ల గజ్జెలు
ఘల్లుమన్నవి!!





## గుడుగుడుకుంచం.....

గుడుగుడుకుంచం గుండేరాగం,
పావడపట్టం పడిగేరాగం,
అప్పడాలగుట్టం ఆడుకోబోతే,
పేపేగుట్టం పెళ్లికిపోతే,
అన్నా! అన్నా! నీ పెళ్లెపుడంటే
రేపుగాక, ఎల్లుండి.
– కత్తీగాదు, బద్దాగాదు గప్, చిప్!





## చెమ్మచెక్క

చెమ్మ చెక్క, చేరెడేసి మొగ్గ,
అట్లుపొయ్యంగ, ఆరగించంగ,
ముత్యాల చెమ్మచెక్క ముగ్గు లెయ్యంగ,
రత్నాల చెమ్మచెక్క రంగు లెయ్యంగ,
పగడాల చెమ్మచెక్క పంది లెయ్యంగ,
పందిట్లో మా బావ పెండ్లి చెయ్యంగ,
చూచివద్దాం రండి, సుబ్బరాయుడు పెండ్లి,
(సూర్యదేవుడిపెండ్లి, చూచివత్తాం రండి)
మావాళ్లింట్లో పెండ్లి, మళ్లీ వద్దాం రండి;
దొరగారింట్లో పెండ్లి, దోచుకువద్దాం రండి!

## నెత్తిమీద గోరింక

ఓ అ(బ్బా)మ్మాయి నెత్తిమీద గోరింక!
చెప్పకు చెప్పకు చెడిపోతావు,
చెప్పితే నీ ముక్కు తెగ్గోస్తా,
దూలంమీంచీ దూకిస్తా,
పందిలిమీంచీ పాకిస్తా,
కంచం అన్నం తినిపిస్తా,
కడివెడునీళ్లు తాగిస్తా!







## తాత పెండ్లి

ఊచకట్టోచేత, ఉగ్గమోచేత
ఊగుతూ వచ్చిన్న తాతెవ్వరమ్మ?
 మానికా నిండాను మాడ లోసుకుని,
 మనుమరాలా నిన్ను మనుమడగ వస్తి!
వాడిన్నపూవుల్లు వాసనలుగలవా?
ఓ తాత! ఈ మనుము వొద్దయ్య నాకు!



## దాగుడు మూతలు

దాగుడుమూతా దండాకోర్,
పిల్లీవచ్చె ఎలుకా దాగె!
ఎక్కడి దొంగా లక్కడే
గప్‌చిప్ – సాంబారుబుడ్డి.



## ఒప్పుల కుప్ప

ఒప్పులకుప్పా,
ఒయ్యారిభామ!
సన్నబియ్యం,
చాయపప్పు;
చిన్న మువ్వ,
సన్న గాజు;
కొబ్బరికోరు,
బెల్లపచ్చు;
గూట్లో రూపాయి,
నీ మొగుడు సిపాయి!
(రోట్లో తవుడు,
నీ మొగు డెవడు?)





## బొమ్మల పెండ్లి

(బాలికలు చందనపు బొమ్మలకు పెండ్లితంతు నడిపింతురు. అప్పు డీ పదము పాడుదురు.)

చిట్టిబొమ్మలపెండ్లి చేయవలెననగా,
శృంగారవాకిళ్లు సిరితోరణాలు;
గాజుపాలికలతో, గాజుకుండలతో,
అరటిస్తంభాలతో అమరె పెండ్లరుగు

చిన్నన్న పెట్టెనే వన్నెచీరల్లు,
పెద్దన్న పెట్టెనే పెట్టెల్లసొమ్ము,



నూరుదునె బొమ్మ, నీకు నూటొక్కకొమ్ము,
పోతునే బొమ్మ నీకు పొన్నేలునీళ్లు.

కట్టుదునె బొమ్మ, నీకు కరకంచుచీర,
తొడుగుదునె బొమ్మ, నీకు తోపంచు రవిక,
ఒడిబియ్యం పెదుదునే ఒడిగిన్నె పెదుదు,
అత్తవారింటికీ పోయి రమ్మందు.

అత్తచెప్పినమాట వినవె ఓ బొమ్మ!
మామ చెప్పినపనీ మానకే బొమ్మ!
రావాకు చిలకమ్మ ఆడవే పాప!
రాజుల్లు నీచెయ్యి చూడవచ్చేరు.

ప్రధానపుంగరం పమిడివత్తుల్లు,
గణగణగ వాయిస్తు గంటవాయిస్తు,
గజంబరాయడూ తల్లి రాగాను,
తల్లి ముందరనిలచి యిట్లన్ని పలికె.



అన్న అందలమెక్కి, తాగుఱ్ఱమెక్కి,
గుఱ్ఱమ్ముమీదను పల్లమున్నాది,
పల్లమ్ముమీదను బాలుడున్నాడు,
బాలుడిముందరికి కూతుర్నిదేరె,
కూతురిసిగలోకి కురువేరు దేరె,
నాకొక్క ముత్యాలబొట్టు దేరమ్మ!
బొట్టుకు బొమ్మంచు చీర దేరమ్మ!
చీరకు చిలకల్ల రవికె దేరమ్మ!
రవికకు రత్నాలపేరు దేరమ్మ!
పేరుకు పెట్టెల్ల సొమ్ము దేరమ్మ!

చిన్నన్న దెచ్చాడు చింతాకుచీర,
పెద్దన్న తెచ్చాడు పెట్టెల్ల సొమ్ము,
రావాకు చిలకతో ఆడబోకమ్మ,
రాజుల్లు నీచెయిది చూడవచ్చేరు.





వీధిలో ముడివిప్పి ముడువబోకమ్మ,
పల్లెత్తి గట్టిగా పలుకబోకమ్మ,
పొరుగిళ్ల కెప్పుడూ పోవకేబొమ్మ,
నలుగురీ నోళ్లల్లో నానకేబొమ్మ!

(ఈ బొమ్మల పెండ్లిళ్లలో వియ్యాలవారి విందులు, అలకలు, మొదలుగా గల పెండ్లి మర్యాదలన్నీ నడుపుదురు. ఇది భావికాలమందు వాస్తవముగా జరుగబోయే విషయములకు అభ్యాసకృత్యమనవచ్చును; యాజ్ఞికుల శుష్కేష్టుల వంటిది. దీనిచే పసితనముననే బాలికలకు, కులాచార సంప్రదాయములందు ప్రవేశ మేర్పడును. ఈ యలవాటుచే నటు తర్వాత వానిని చక్కగా జరుపుకో గల్గుదురు.)

ఎండా వానా పెళ్లాడే,
ఎడవల్లప్పయ్య యాజ్ఞీకుడు!

(ఎండ కాస్తుండగానే, వాన కురుస్తున్నప్పుడు పాడే పాట)





## నాలుగుస్తంభాలాట

నాలుగు స్తంభాలాటా,
నడిమికి తొడిమికి,
తానక తప్పక,
తన పేరేమంటే,
ఉట్టిమీద బెల్లం,
పొట్టికాకరకాయ!
బావా, బావా!
బరుకూ, బరుకూ!
తన్నులు తింటే –
తలకొకటి. (తలకట్టు)





## సందెగొబ్బె

సీతమ్మ వాకిటా
చిరుమల్లె చెట్టు,
చిరుమల్లె చెట్టేమొ
చితుకచూసింది.
(చిగిరించి పూసె)
చెట్టు కదలాకుండ
కొమ్మవంచండి;
పట్టి పూవులుకోసి,
బుట్ట నింపండి;
అందులో పెద్దపూలు
దండ గుచ్చండి;
దండ తీసుకువెళ్లి
సీత కివ్వండి.
దాచుకో సీతమ్మ
దాచుకోవమ్మ!
(రాముడంపాడు)
దాచుకోకుంటేను
దోచుకొంటారు;
దొడ్డి గుమ్మములోన
దొంగలున్నారు.



## గుమ్మాడమ్మా.....

గుమ్మాడమ్మా గుమ్మాడీ,
ఆకుల్లువేసింది గుమ్మాడీ,
పూవుల్లు పూసింది గుమ్మాడీ,
పండ్లుపండిందమ్మ గుమ్మాడీ,
అందులో ఒకపండు గుమ్మాడీ,
అతి చక్కనీ పండు గుమ్మాడీ,
ఆ పండు యెవరమ్మ గుమ్మాడీ,
మా చిట్టి తండ్రమ్మ, గుమ్మాడీ!
ఏనుగమ్మా ఏనుగు!

ఏ ఊరొచ్చింది ఏనుగు?
మా ఊరొచ్చింది ఏనుగు.
ఏం చేసింది ఏనుగు?
మంచినీళ్లు తాగింది ఏనుగు.
ఏనుగు ఏనుగు నల్లన్న,
ఏనుగు కొమ్ములు తెల్లన్న.
ఏనుగుమీద రాముడు,
ఎంతో చక్కని దేవుడు!





## తారంగం



తారంగం తారంగం
తాండవకృష్ణా తారంగం,
వేణూనాధ తారంగం
వేంకటరమణా తారంగం,
వెన్నలదొంగా తారంగం
చిన్నికృష్ణా తారంగం.

✻ ✻✻

తారమ్మయ్యా!
రవికుల రామచంద్రయ్యా!



తోడుపాశం తోడు,
తొంగల్లి రెప్పల్లతోడు,
ముద్దు మాణిక్యమ్ము తోడు,
మురహారి అక్కెప్ప తోడు,
తోడుతే నీ చెయ్యి వేడి,
జూరుకో పాయసం జూరుకో!



# తప్పుటడుగులు

(ఏనుగు లక్ష్మణకవి పెద్దాపురపు రాజకుమారుని మీద చెప్పిన పాట.)

పల్లవి

అప్పా రావోయీ!, ఒప్పుల కుప్పా రావోయీ!
తప్పుటడుగూ లిడుచూమా తండ్రీ రావోయీ!

అను పల్లవి

అంగిలోపలా నీ బొజ్జా
ఆకలి గొన్నాదీ
బంగారూ నా తండ్రీ నీకూ
పాలూ పోసేనూ



రంగూగా నే నెంతా పిలిచిన
రాకా జుణిగేవూ!
బుంగా పట్టూకోనీ పెద్దా
బూచీ వచ్చేనూ!
లాలా పోసుకో బాబయ్యా
చాలా ప్రొద్దాయే;
తాలీ మీతో నీకూ వెనక
దాదూ వుంచేనూ!
పాలూ బువ్వా తిని తొట్టేలో
పవ్వాళించితే
లాలీపాటాలాతో నిన్నూ
జోలా పాడేనూ!
సరిపేషూ గట్టీ నిండూ ము
స్తాబూ చేసేను;
అరుదూగా నీ చమరూ లోకీ
ఆడూకో బొమ్మీ!
ఉరువైనా నీ సొగసూ చూచీ
ఉప్పొతించేరు;
తిరుగాబోకు మీ స్వారీలో
దృష్టీ తాకేనీ!
అప్పా రావోయీ! ఒప్పులకుప్పా రావోయీ!
తప్పుటడుగూ లిడుచూనూ మా తండ్రీ రావోయీ!



## చక్కిలి గింతలు

(పసిబిడ్డలను పెద్దవారు దగ్గర కూర్చుండబెట్టుకొని అరచెయ్యి పట్టుకొని ఈ క్రింది పదము చెప్పుతూ ఆయా పనులు చేస్తున్నట్టు అభినయిస్తూ చివరకు బిడ్డ చంకలో చక్కలిగింత పెట్టుతారు. బిడ్డ నవ్వుతుంది.)

పప్పుపెట్టి, పాయసం పెట్టి,
అన్నంపెట్టి, అప్పచ్చి పెట్టి,
కూరపెట్టి, ఊరగాయ పెట్టి,
నెయ్యివేసి, ముద్దచేసి,
తినిపించి, తినిపించి,
చెయిగడిగి, మూతిగడిగి,
తాతగారింటికి దారేదంటే,
(అత్తవారింటికి దారేదంటే)

ఇట్లాపోయి, ఇట్లాపోయి,
మోచేతిపాలెం ముందర్నుంచి
ఇట్లాపోయి, ఇట్లాపోయి,
ఇదిగోఇదిగో, వచ్చాంవచ్చాం,
చక్కావచ్చాం చక్కావచ్చాం,
చక్కిలిగిలిగిలి చక్కిలిగిలిగిలి!



## దొంగవో? దొరవో?

పెద్దవారు బిడ్డను ముందు కూర్చుండబెట్టుకొని 'నీవు దొంగవో దొరవో కనుగొందునా' అని అడిగి –

దొంగవో దొరవో?
దొంగవో దొరవో? –

అంటూ ముడ్డిపూసదగ్గరనుండి ముచ్చిలిగుంట దాకా వెన్నెముకను అలాకనగా తాకుతారు. దానిచేత బిడ్డకు చక్కిలిగిలి యేర్పడుతుంది. కొంత దూరము ఓర్చుకోవచ్చునుగాని ముచ్చిలి గుంట చేరువకు రాను రాను చక్కిలిగింతను నిబ్బరించుకోవడము సాధ్యము కాకపోతుంది. నిబ్బరించుకోలేక చక్కిలిగింతపడి బిడ్డనవ్వును. నవ్వితే దొంగ, నవ్వకుంటే దొర, అని నిర్ణయము. 'నవ్వినావులే' అని చక్కిలిగిలి పెట్టినవారు గేలిచేస్తారు. అందుకని బిడ్డ చక్కిలిగింత పడకుండా నిబ్బరించుకునే టందుకు ప్రయత్నించును.







## దీపారాధన

రక్ష రక్ష!
సంధ్య రక్ష!
సర్వ రక్ష!
దీపరక్ష!
దివ్యరక్ష!
చిన్ని నా అబ్బాయికి
శ్రీరామరక్ష!

(దీపం పెట్టగానే దీపానికి అరచేయి చూపి, అబ్బాయి కండ్లకు అద్దుతూ ఈ పాట పాడుతారు.)



## గోరుముద్ద; గుజ్జుముద్ద



పసిబిడ్డలకు చిట్టిపిడతలతో అన్నము మెత్తగా వండుదురు. ఆ మెత్త నన్నమును కంచంలోగాని గిన్నెలో గాని కలిపి గోరుముద్దలని, గుజ్జు ముద్దలని, పేర్లుచెప్పుతూ తిని పిస్తారు. బొటనవేలి గోరు మీదికి కొంచెముగా తీసుకొని పెట్టేదాని పేరు గోరుముద్ద. కలిపేటప్పుడు మెత్తనచేత చేతికంటితే కంచము అంచునగాని, గిన్నె అంచునకాని గీచి ఎత్తిపెట్టేదాని పేరు గుజ్జుముద్ద. పసి బిడ్డలు గోరుముద్దలన్నా గుజ్జు ముద్దలన్నా, అల్లరిమాని ఆరగిస్తారు. గోరుముద్దకంటె గుజ్జుముద్ద ఎక్కువ రుచిగలది.





## అమ్మముద్ద; నాన్నముద్ద

పసిపిల్లలు అప్పుడప్పుడు అన్నము తినక మారాము పట్టుతూ ఉంటారు. అప్పుడు అన్నము పెట్టేవాళ్లు ముచ్చట్లు చెప్పి ఆనందము కలిగించి మారాము మరపించి అన్నము తినిపిస్తారు. అట్టి ముచ్చట్లు కొన్ని:-

"అమ్మా! నాన్న మంచివాడు కాదూ! ఇదిగో! ఇది నాన్న ముద్ద! తిను, తినవూ? నాన్న మంచివాడు కాదూ? ఆ వేళ నీకు మిఠాయి తెచ్చిపెట్టలేదూ? నీకు మంచి చొక్కాలు కుట్టించలేదూ?" అవునవు నని అంగీకరించును. ''అయితే తినుమఱి. మళ్లీ మిఠాయి తెచ్చిపెట్టుతాడు" :- తినును. తర్వాత, "ఇదిగో? ఇది అమ్మ ముద్ద," అంటూ తండ్రి ప్రేమవలెనే తల్లి ప్రేమను జ్ఞాపకపరిచి ఇంకొక ముద్ద తినిపిస్తారు. అట్లాగే ఆ తర్వాత, అత్తయ్యల ముద్ద, మామయ్యల ముద్ద అంటూ బంధువుల పేర్లతో వారి వారి ప్రేమలను జ్ఞాపకపరుస్తూ అన్ని ముద్దలను తినిపిస్తారు.

దీనివలన పిల్లలకు మారాము మానడము, తినవలసిన అన్నము తిన్నగా తినడము, బంధువులమీద ప్రేమబంధము మనసులో చక్కగా నిలుపు కొనడము కలుగుతుంది.



## దొంగబువ్వ

అన్నము పెట్టేవాళ్లు ముద్దలు కలిపి కన్నులు మూసుకొని ఒక్కొక్క ముద్ద ఎత్తి పట్టుకొని ఇట్లు చెప్పుతారు.

కుక్కేవచ్చి తింటుందో, నక్కేవచ్చి తింటుందో!
యెలికే వచ్చి తింటుందో, చిలకే వచ్చి తింటుందో!
పిల్లే వచ్చి తింటుందో, బల్లే వచ్చి తింటుందో!
మా అమ్మాయే తింటుందో!
మా అబ్బాయే తింటాడో!
యెవరువచ్చి తింటారో,
యెవరువచ్చి తింటారో!!

ఇట్లా చెపుతూ చెయ్యి అటూ ఇటూ తిప్పుతూ ఎరుగనట్టు బిడ్డ ముఖము దగ్గరకు తీసుకొనిపోతే, తాను కానట్టు గటుక్కున మ్రింగును. ఇట్లు అంతా తినిపించిన తర్వాత "చాకలివాళ్ల కుక్కవచ్చి చల్లా అన్నం తినిపోయింది పో -అమ్మాయి (అబ్బాయి) యింక నీకేది? నీకు లేదులే-" అని ముగించి మూతి చెయ్యి కడుగుతారు.





## వెన్నెలగుజ్జులు

వెన్నెల రాత్రులందు పసిబిడ్డలను ఎత్తుకొని చందమామ ముచ్చట్లు చెప్పుతూ ఆరబైట అన్నము తినిపించడము తల్లులకు అలవాటు. "అమ్మా! చూడు, చందమామలో ఒక ముసలమ్మ పొయిమీద కుండపెట్టుకొని అన్నము వండుకొంటూ కూర్చున్నది! చూచావా! అదుగో! నల్లగా కనుపడుతున్నది!" అంటారు. ఈ పదము చెప్పుతారు.

చందమామ రావె! జాబిల్లి రావె!
కొండెక్కి రావె! గోగుపూలు తేవె!
ఒలవనిపండు ఒళ్లో ఉంచుకొని,
ఒల్చినపండు చేత బుచ్చుకొని,
వెండిగిన్నెలో వెన్న పెట్టుకొని,
పమిడిగిన్నెలో పాలు పోసుకొని,
అమ్మా, నువ్వూ తిందురుగాని!
అట్టా అట్టా రావె!
చందమామా!



ఇంకా ఈ పద్యములు కూడా చెప్పుతారు.

వెండిగిన్నెలోన వెన్నయు నెయిపోసి,
పమిడిగిన్నెలోన పాలుపోసి,
చందమామరావె! జాబిల్లిరావె! మా
చిన్నిబిడ్డతో భుజింతుగాని.

జేజేలకును బువ్వ! శివునియౌదల పువ్వ!
జాబిల్లి రాగదే చందమామ!
మెందుచీకటి గొంగ! మెఱయుచుక్క బొజుంగ?
జాబిల్లి రాగదే చందమామ!
చిగురుకైదువుకామ చెలగురావుతుమామ!
జాబిల్లిరాగదే చందమామ!

చిన్నయన్నకు శ్రీరఘుశేఖరునకు
వెండిగిన్నియలోపల వెన్నపోసి,
పమిడిగిన్నియలోపల పాలుపోసి,
చాల దినిపించి పోగదే చందమామ!





## జోలపాట

శ్రీరమ్యదేహ లాలీ! మా ముద్దు
చిన్నారి కూన లాలీ!
గారాల కూచిలాలీ! మాయప్ప
కంజాతనయన లాలీ!
సకల లోకాధారుదూ! మునిమనో
జలజాత సంచారుదూ,
అకలంక గుణపూరుడూ, మముబ్రోచు
ఆర్యామనోహారుడూ.
ఇందీవరేక్షణుండు, నిజభక్త
బృందారకావనుండు
ఇందిందిరాలకుండూ, మముబ్రోచు
ఇందిరా నాయకుండు.



శ్రీవాగ్మనోధినేత నిజభక్త
చింతితాభీష్టదాత,
దేవేశు డా విధాత నీకు తా
దీర్ఘాయు వొసగు గాత!!

## బూచివాని బిలువనంపనా?

గోపాల బాల!
బూచివాని బిలువ నంపనా?
బూచివాని బిలువ నంపబోతె వద్దు వద్దనేవు?
బాచి యిచ్చి, జోలపాడి, యూచినాను నిదురబోవు.
బూచివాని బిలువ నంపనా?

అల్లమూరగాయ పెరుగు అన్న మారగించు మంటె
వల్ల తేనె జొనలు గావలెను తెమ్ము తెమ్మనేవు?
బంతిచేతికిచ్చి గోపాల! యాడుకొమ్మనంటే
పంతగించి వేటుచోట బంతులవిగొ తెమ్మనేవు?
బాగుగాను పూలపాన్పు పైన బవ్వళించు మంటే
నాగుబాము పడగనెక్కి నాట్యమాడవలె ననేవు?
మత్తగజము తెచ్చి చిన్న తిత్తిలోపల నుంచి నా
నెత్తిమీద బెట్టి నన్నెత్తికో యశోదనేవు?
రామశైలభద్రగిరి రామదాసు నేలుస్వామి
కామితార్థఫలము లొసగి కైవల్యము జూపువాడ!
బూచివాని బిలువ నంపనా?



* * *